# 18. మిస్ నీహారిక

ఆఫీసర్ వరదాచారి బెల్ కొట్టాడు. లోపలికి వచ్చిన చప్రాసీతో అన్నాడు.

"తరిణయ్యా! ఒయస్‌గారికి సలాములు చెప్పు"

ఆఫీసు సూపరింటెండెంట్ దశరథరామయ్య ఛాంబరులోకి వచ్చి ఆఫీసరు ఎదురుగా టేబిలు దగ్గిర నిలుచున్నాడు.

"రేపటి ఎంక్వయిరీ గురించి ఫైలు సిద్ధం చేశారా?"

"చేశాను సార్!"

"ఇవాళ సాయంకాలం ఏడు గంటలకు యార్డు నుంచి గూడ్సు ట్రెయిన్ బయలుదేరుతుంది. దానికి నాసెలూన్ తగిలించమని చీఫ్ కంట్రోలర్‌తో చెప్పాను. సీనియర్ స్టెనో రామారావుకి ఫైలిచ్చి..."

వరదాచారి మాటలు పూర్తికాలేదు.

"చిన్న మార్పు సార్!" అన్నాడు దశరథరామయ్య.

"ఏమిటది?"

"మీరు మధ్యాహ్నం మీటింగులో వున్నప్పుడు రామారావు అర్జంటుగా సెలవు పెట్టి వెళ్లిపోయాడు, భార్యను హాస్పిటల్‌లో చేర్చాలని"

"సీనియర్ ఇంజనీరు స్టెనో, వెంకట్రావును బుక్‌చేయండి."

"అతను డ్యూటీమీద కలకత్తా వెళ్లిపోయాడు"

"మరెవరిని బుక్ చేశారు"?

"నీహారికను"

"నీహారికనా?"

"అవునుసార్! మిస్ నీహారికను బుక్ చేశాను. ఆమె నాలుగయిదు సార్లు మీ దగ్గర పనిచేసింది. ఆమె తప్ప సీనియర్ స్టెనోలు మరెవరూ అందుబాటులో లేరు".

"ఆమె లైన్‌మీదకి వెళ్లనానికి అంగీకరించిందా?"

"డ్యూటీ మీద వెళ్లడానికి ఆమె నిరాకరించలేదు"

"ఓ; ఐసీ!"

మరే పలుకూ లేకుండా వరదాచారి ఛాంబరు విడిచి వెళ్లిపోయాడు.

డ్రైవరు సరిగా ఆరు గంటలకు క్వార్టర్లలో చివర వున్న యూనిట్లలో ఒకదాని దగ్గర జీప్ ఆపి హారన్ మోగించాడు.

నీహారిక తల దువ్వుకుంటూ వీధి తలుపు దగ్గరికి వచ్చింది.

"సూర్యారావా! ఇదిగో ప్రయాణానికి తయారవుతున్నాను" అంది ఆమె.

"దొరగారు యిలా చెప్పారు: యార్డు నుండి గూడ్సు బండి ఏడు గంటలకు విడుస్తుంది. మిమ్మల్ని తీసుకొని సరిగా ఆరున్నరకు బంగళాకు రమ్మన్నారు. కాబట్టి ఆలస్యం చేయకండి' అన్నాడు సూర్యారావు.

" మీ దొరగారికేం, మగమహారాజు! ఉన్నపాళంగా జీప్ ఎక్కి వెళ్లిపోగలడు. ఆడవాళ్లు కనీసం ఒకగంటయినా తయారవందే బయలుదేరలేరు".

"అమ్మోయ్! చచ్చాను. దొరగారు నా ఉద్యోగం తీసేస్తారు. ఆరున్నరకు బంగళా దగ్గిర ఉండకపోతే!" "అయితే వెళ్లిపోండి. నాకు అంతకు ముందు బయలుదేరడానికి వీలవదు. లైను మీదికి ఏ చీరలు పట్టుకెళ్లాలో తేలేసరికి అరగంట పడుతుంది?"

"స్టెనోగారూ! ఒక అరగంట కలిసివచ్చే ఉపాయం చెప్తా, వినండి"

"ఏమిటది?"

"ఎన్ని పెట్టెల్లో మీ చీరలున్నాయి?"

"ఒక పెద్ద వి ఆయ్. పి పెట్టె, రెండు తోలు సూటుకేసులు"

"ఇంతే కదా! అవన్నీ జీపులో ఎక్కిద్దాం. సెలూన్‌లో కూర్చుని సావకాశంగా మీకు నచ్చిన చీరలు ఎంచుకోవచ్చు"

"బ్రిలియంట్ ఐడియా!"

అప్పటికే జీపు దొరగారి బంగళా చేరేసరికి ఆరూ నలభై అయిదయింది. ఆఫీసరు వరదాచారి ఆరున్నర నుండి బంగళాలో వరండా నుండి ఆవరణ గేటు వరకు ఆకలిగొన్న పులిలా పచారులు చేస్తున్నాడు.

"సూర్యరావ్! ఎందుకింత ఆలస్యం?" గర్జించాడు ఆఫీసరు.

అంతవరకు ముందు సీటులో కూర్చున్న నీహారిక జీప్ దిగుతూ అంది.

"సార్! సమాధానం చెప్పవలసినదానిని నేను. మీరు ఉన్నపాళంగా జీప్ ఎక్కి వెళ్లిపోగలరు. నాకలా వీలవుతుందా? ఇల్లు చక్కబెట్టుకొని తాళాలు వేసుకొని రావాలి. ఇంతకీ మన సెలూను గూడ్సు ట్రయినుకి తగిలించారు. కాని కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌కి కాదు కదా! మీరు

వచ్చేవరకు అది వేచి వుంటుంది"

నీహారిక ముదురాకుపచ్చ నేత చీర కట్టుకుంది. నిరాడంబరంగా తయారయింది. ఆమెవేపు చూస్తున్న ఆఫీసరు ఆ మాటలు విని ప్రపంచంలోకి వచ్చినట్లయాడు.

"నీహారికా! మీరు దిగిపోవద్దు. ముందు సీటు లేడీస్ కోసం" అన్నాడతడు.

నీహారిక తిరిగి ముందు సీటులో ఎక్కింది.

దొరగారు వెనుకసీటులో కూర్చోడానికి వెళ్లారు. కాని ఒక పెద్ద పెట్టె, మూడు చిన్న పెట్టెలు, పెద్ద బెడ్‌రోలు, అల్లిక బుట్టలు రెండు, వెరసి అన్ని వెనక సీట్లు నిండి ఆఫీసరు గారికి అరంగుళమైనా కూర్చోడానికి చోటు మిగలలేదు.

ఇవాళ నుండి గూడ్సు ట్రెయిన్లను సకాలంలో నడపడానికని పంచ్యువాలిటీ వారం మొదలవుతోంది. సీనియర్ ఆఫీసరు వరదాచారి ప్రయాణం చేయవలసిన గూడ్సుతోనే ఈ వారం మొదలవుతోంది.

వరదాచారి రిస్టువాచీ చూసుకున్నాడు. ఏడుకి ఇంకా పది నిమిషాలు మిగిలాయి. కాలం మరి వ్యర్థం చెయ్యలేదు ఆఫీసరు. బంగళా ప్యూన్ అతని సూట్‌కేస్ జీప్‌లో ఉంచాడు. దొరగారు స్టీరింగ్ తీసుకున్నారు. డ్రైవరు సూర్యారావు వెనుక స్టెప్ మీద టాప్ పట్టుకొని నిలుచున్నాడు.

జీప్ గాలిలో ఎగిరిపోయింది.

సామానులన్నీ జీప్ నుండి సెలూన్‌లోకి ఎక్కించిన వెంటనే గార్డు ముఖర్జీ పచ్చదీపం చూపించడం, డ్రైవరు నారాయణరావు ట్రెయిను స్టార్టు చేయడం, వరదాచారి రిస్టువాచీలో ఏడుగంటలవడం- అన్నీ ఒక్కసారి జరిగాయి.

డిసెంబరు నెల- బైట చలిగా వుంది. వరదాచారి సెలూన్ తలుపు మూశాడు. లోపల వెచ్చగా వుంది. చుట్టూ కలయజూశాడు ఆఫీసరు. ఏదో కొత్తదనం అంతటా కనిపించింది. డోర్ కర్టెన్లు, విండో కర్టెన్లు, లేత రంగుల్లో లతలతో అందంగా ఉన్నాయి. లాంప్‌షేడ్‌లు కూడా కొత్తవే. లోపల చాల శుభ్రంగా, పాలిష్ మెరుపులతో కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది.

వరదాచారి కోటు తీసి హాంగర్‌కి తగిలించాడు. టై వదులు చేసుకొని కిటికీ దగ్గరవున్న సోఫాలో కూర్చున్నాడు. చేతి వాచీ చూసుకున్నాడు. ఏడున్నరయింది.

అటెండెంట్ పైడయ్య, దొరగారు బెల్ వాయిస్తే రుమాలు గుడ్డ భుజంమీద వేసుకొని, ఛాంబరు తలుపు తెరచుకొని లోపలికి వెళ్లాడు.

"పైడయ్యా! టీ తయారయిందా?"

"తయారయింది సార్"

"వేడినీళ్లు సిద్ధంగా ఉన్నాయా?"

"స్టైనోగారు కాగిన నీళ్లు తీసుకొని ఇప్పుడే బాత్‌రూమ్‌లోకి వెళ్లారు. మళ్లా పొయ్యిమీద నీళ్లు పెట్టాను. ఒక్క పది నిమిషాలలో వేడెక్కుతాయి."

"ఐ సీ!"

పైడయ్యా ట్రేలో టీపాట్, పాలు, కప్పు, సాసరు, పంచదార క్యూబులు, చంచాలు తెచ్చి చిన్న బల్ల ముందుకు లాగి దానిమీద ఉంచాడు.

వరదాచారి ట్రేలోని సామాన్లన్నీ చూశాడు. అన్నీ కొత్తగా కనిపించాయి. సావకాశంగా అతను కప్పులో టీ లిక్కరు పోసుకొని పాలు కలుపుకొని, మూడు పంచదార క్యూబులు దానిలో వేసుకొని చంచాతో కలుపుతూ ఎదురుగా నిలుచున్న పైడయ్య వేపు చూసి అన్నాడు.

"ఎన్ని గంటలకు డిన్నరు తయారవుతుంది?"

"తొమ్మిది గంటలకు సార్!"

"గుడ్!" అన్నాడు అఫీసరు టీ సిప్ చేస్తూ

పైడయ్య అతని ముఖంలోకి చూస్తూ నిలబడ్డాడు.

టీ తాగడం పూర్తిచేసి వరదాచారి అన్నాడు.

"స్టైనోగారు రాగానే, వేడినీళ్లు బాత్‌రూమ్‌లో పెట్టి నాతో చెప్పు"

"అలాగే సార్!" అన్నాడు పైడయ్య ట్రే తీసుకుపోతూ.

రెండుమూడు సార్లు వరదాచారి రిస్టు వాచీ చూసుకున్నా లాభం లేకపోయింది. సరిగ్గా ఎనిమిదింటికి ఆఫీసరు బాత్‌రూమ్‌లోకి ప్రవేశించాడు. వేడి ఆవిరులలో ఆమె వాడిన సబ్బు యొక్క సుగంధం అంతటా అలుముకుంది. లోపల రెండు స్టెయిన్‌లెస్ స్టీలు బకెట్లు, అటువంటివే మగ్గులు వున్నాయి. చిన్న షెల్ఫులో 'హెర్స్' అన్న బోర్డు వున్న దగ్గిర ఆవిడ సబ్బు, తలనూనె మొదలైన అలంకార సామాగ్రి ఉన్నాయి. 'హిస్' అన్న బోర్డు వున్న రెండో అరలో అతని సబ్బు, దువ్వెన, తలనూనె ఉన్నాయి. పాగా కొయ్యకు పెద్ద బాత్ టవలు, చిన్ని ఫేస్ టవలు వున్నాయి.

వరదాచారి స్నానం చేసి బట్టలు మార్చుకునేసరికి ఎనిమిదిన్నర అయింది. తెల్లటి పైజమా వేసుకొని, కల్లీ లాల్చీ తొడుక్కొని స్ఫటికంలా అతను కూర్చున్నాడు. అతను ఆ రాత్రి ఏమీ ఆలోచించ దల్చుకోలేదు. వారం రోజులయి, ఆఖరికి ఆదివారంనాడు కూడా, తీరిక లేకుండా ఏవో మీటింగులలో పాల్గొంటూనే వున్నాడు. ఏదో ఆలోచన విడువకుండా వుంటునే వుంది. బెస్ట్ సెల్లర్ కొత్తదొకటి స్టేషనులో కొన్నాడు. డిన్నరయిన తరువాత వెచ్చగా రగ్గు కప్పుకొని, పుస్తకం చదువుకుంటూ నిద్రలోకి జారుకుందామనుకున్నాడు.

ఈ ఆలోచనలలో పడి అతను టైము కూడా మరిచిపోయాడు. తీరా వాచీ చూసుకుంటే తొమ్మిది గంటలు దాటి పదిహేను నిమిషాలయింది. పైడయ్య కోసం బెల్‌కొట్టాడు.

భుజం మీద ఎర్రంచు రుమాలు వేసుకొని తలుపు తెరచుకొని పైడయ్య లోపలికి వచ్చాడు.

"డిన్నరుకి ఇంకా ఆలస్యమా?" ఆఫీసరడిగాడు.

"లేదుసార్! అంతా రడీయే. కాని చిన్న చిక్కొస్తే ఏమిటి చేయడమో తెలియకుండా పోయింది సార్!"

"ఏమిటది"?

"ఇంతవరకు మగ స్టెనోలు వచ్చినప్పుడు ఏ ఇబ్బంది కలగలేదు. భోజనం ప్లేట్లో యిస్తే తమ గదిలో తినేవాళ్లు. దొరలకు తెలిసేదే కాదు."

"ఇప్పుడొచ్చిన చికాకేమిటి?"

"స్టెనోగారు టేబిలు మీద తప్ప తన గదిలో బెర్తు మీద తినలేమన్నారు."

"ఓ ఐసీ!"

"మీరు డిన్నరు తీసుకున్న తరువాత ఆమెకు పెట్టాలి"

"పైడయ్యా! అలా పనికిరాదు. మాఇద్దరికీ టేబిలు సర్దు".

ఛాంబరులో ఒక మడత టేబిలుంది. దానిని నిలబెట్టి, రెండు మడత కుర్చీలు విప్పి, డిష్లు, బౌల్స్, ప్లేట్లు, చెంచాలు, కత్తులు మొదలయినవన్నీ సర్ది నీహారికను పిలిచాడు పైడయ్య.

నీహారిక తెల్లని సిల్కు చీర కట్టుకుంది. జరీ అంచున్న బ్లౌజు తొడుక్కుంది. ఆమె ఎడమ చేతికి రిస్టు వాచీ, కుడిచేతికి బంగారు గాజులు, మెడలో ఒంటిపేట గొలుసు వున్నాయి. చెవులకు రింగులున్నాయి. నుదుట తిలకం దిద్దుకుంది. అసలే ఆమె చక్కనిది. స్నానం చేసి వచ్చిన తరువాత ఇంకా తాజాగా వుంది.

"బాస్! నా వల్ల మీకు లేటయింది." అంది కుర్చీ దగ్గరగాలాగి నీహారిక.

"ఇదోలేటా! పాపం మీకు ఆలస్యమయింది" అన్నాడు ఆఫీసరు.

తరువాత ఎవరికి కావలసినవి వాళ్లు వడ్డించుకున్నారు. స్ఫటికాల వంటి స్వచ్ఛమైన గ్లాసులలో పైడయ్య మంచినీళ్లు పోశాడు.

ఆ రాత్రి మెనూ అలా వుంటుందని ఊహల్లో కూడా వరదాచారి భావించలేదు.

స్టఫ్డ్ టొమాటో, కాకరకాయ వేపుడు, దోసావకాయ, రసం, అప్పడాలు, తీయని గడ్డ పెరుగు, సన్న బియ్యపుటన్నం, వెన్న కాచిన నెయ్యి...

డిన్నరు ప్లేట్లు, చెంచాలు, కప్పులూ అన్నీ కొత్తవే. అన్నిటికంటె కొత్తగా ఉంది డిన్నరు.

వరదాచారికి ఎవరినభినందించాలో తెలిసింది కాదు.

పదిన్నరకి దొరగారు పక్కమీద పడుకున్నారు. ఫోమ్ తలగడా గలీబులు కూడా కొత్తవే. వాటిమీద చక్కని డిజైన్లలో పువ్వులుకుట్టి వున్నాయి.

అతను ఇంగ్లీషు నవల విప్పి ఒక ప్రకరణం కూడా ముగించలేదు. తలుపు కొట్టిన చప్పుడు వినిపించింది.

"లోపలికి రావచ్చా సార్!" అంటున్నాడు పైడయ్య.

"కమిన్"

"సార్! చిన్న ఇబ్బంది కాదు, పెద్దదే వచ్చింది సార్!"

"ఏమిటది పైడయ్యా?"

"స్టెనోగారు పడుకోడానికి చోటులేక కూర్చుండి పోయారు.

"ఐ.సి."

"పై బెర్తుమీద టైపురైటరు,ఆఫీసు ఫైళ్ల సూట్‌కేసు, రెండు అల్లిక బుట్టలు ఉన్నాయి. కిందవున్న కొద్ది జాగాలోను పెద్ద వి అయ్ సి సూటుకేసు, మరో రెండు పెట్టలు, బెడ్‌రోలు వున్నాయి. బెర్తు వెడల్పు ఇరవై అంగుళాలే వుంది. అందుచేత నలభై ఎనిమిది అంగుళాల వెల్పున్న బెడ్ధోలు విప్పితే, విరిగి కింద పడుతున్నది. ఏం చేయడానికి తోచక అన్నీ కట్టేసి ఆమె కూర్చున్నారు"

"ఐ సీ!"

"అన్నీ బాగానే ఉన్నాయి. రాత్రి ఆవిడకు నిద్ర లేకపోతే రేపు ఎంక్వయిరీలో పనిచేయలేనన్నారు."

"పైడయ్యా! రేపు ఆవిడకు చాల పని ఉంటుంది. ఆమె లేవలేకపోతే రసాభాస అవుతుంది."

"అయితే ఏం చేయడం సార్"

"ఒక్క నిమషం నన్ను ఆలోచించనీ"

పైడయ్య ఏం చేయాలో తోచక నిలబడి పోయాడు.

ఒక్క రెండు నిమషాలలో వరదాచారి లేచి నిలుచున్నాడు.

"పైడయ్యా! ఇదుగో, నేను బట్టలు వేసుకుంటున్నాను. మరొక్క అయిదు నిమిషాలలో స్టేషను వస్తుంది. రైలు వేగంతగ్గుతోంది. కాబట్టి ఇక్కడ ఆగుతుంది. చాల రోజులయి నేను ఇంజనుమీద ప్రయాణం, నైట్ ఇన్‌స్పెక్షనూ చెయ్యలేదు. ఈ రాత్రి అవకాశం వచ్చింది. నేను దిగిపోగానే స్టెనోగారిని ఈ విశాలమైన పడక మీద నిద్రపోమను. ఆమె తాజాగా వుంటేనే మనకు పని నడుస్తుంది."

అఫీసరుగారి మాటలు పూర్తికాలేదు, రైలాగి పోయింది. తొందరగా ఆయన జోళ్లు

తొడుక్కొని పుల్ ఓవరు భుజం మీద వేసుకొని సెలూన్ దిగి పోయాడు.

నీహారిక స్పెషల్ బెడ్ మీద నున్న దుప్పటి,రగ్గు తలగడలు పక్కకు పెట్టి, తనతో తెచ్చిన హర్యానా దుప్పటి పరచి ముఖమల్ తలగడ అమర్చి చక్కని రంగులో వున్న ఇంగ్లీషు రగ్గును కాళ్ల దగ్గర వుంచుకుంది.

పైడయ్య సెలూన్ తలుపు లోపల నుండి వేసుకున్నాడు.

"పైడయ్యా! ఇప్పుడు పదకొండుంపావయింది. ఉదయం ఏడున్నర వరకు నన్ను లేపొద్దు.'

పైడయ్య తన కొట్లోకి వెళ్లిపోతే నిహారిక రెండో లోపలి తలుపు వేసుకొంది.

ఆ రాత్రి వరదాచారి విజృంభించాడు.

అసలే అతను రూల్ మాస్టరు.

ఐ.ఎ.ఎస్. పరీక్షలో ఫారిన్ సర్వీసు రాంకులలో రావలసిన వాడు. వ్రాత పరీక్షలో నాలుగోవాడు. అతను చాల స్వతంత్రంగా ఇంటర్వ్యూలో వ్యవహరించాడు. నిర్దాక్షిణ్యంగా పరీక్షాధికారులను విమర్శించాడు. అదే కారణం, అతను వరుసలో కిందకి దిగి, రైల్వే ట్రాఫిక్ సర్వీసులలో నిలిచి బరోడాలో రైల్వే ఆఫీసర్ల ట్రయినింగ్ కాలేజీలో మొదటివాడుగా వచ్చాడు. ప్రొబేషను తీరి,అసిస్టెంటుగా పనిచేసి, ఆరునెల్ల క్రిందే సీనియర్ స్కేలులో ఈ డివిజనుకు బదిలీ అయినాడు.

పని చేయనివాళ్లకు వరదాచారి సింహస్వప్నం. పని చేసే వాళ్లకు దేవుడు. మనిషి వర్చస్వి. అంతగా నవ్వుతూ కనిపించకపోయినా, దుమధుమలాడుతూ వుండడు. అవసరమైదానికన్నా ఒక అక్షరం హెచ్చు మాట్లాడడు. ఎవరికీ చనువివ్వడు.

అటువంటి వరదాచారి అకస్మాత్తుగా రైలాగిన స్టేషన్లో రాత్రి ఇన్‌స్పెక్షన్ చేయడంతో పిట్టల్లా దొంగలు బయటపడ్డారు. ఉద్యోగానికి ఆలస్యంగా వచ్చినవాళ్లు, వేసుకోవలసిన దుస్తులు వేసుకోని వాళ్లు, ఉద్యోగంలో నిద్రపోతున్నవాళ్లు, త్రాగుబోతులు- ఈ విధాంగా చాలామంది అతనికి దొరికిపోయారు. అయిదుగురిని ఉన్నపళంగా సస్పెండు చేశాడు. ఆరుగురికి బదిలీ ఆర్డర్లు వేశాడు. పదిమందిని ఆఫీసులో తనను చూడందే ఉద్యోగానికి తీసుకోవద్దన్నాడు. హాయిగా నిద్రపోతున్న ఇతర ఆపీసర్లను లేపి, నెలల తరబడి చేయకుండా విడిచిపెట్టిన మరమ్మతుల గురించి అడిగాడు. సెక్షన్ సెక్షనల్లా దద్దరిల్లిపోయింది.

ఆ గూడ్సురైలు సరిగా ఉదయం ఏడు గంటలకు ఎంక్వయిరీ జరగవలసిన పెద్ద స్టేషనుకు చేరుకుంది.

దొరగారు సెలూన్ దగ్గరికి వచ్చేసరికి ఏడుగంటల పది నిమిషాలయింది. తనకోసం వేచివున్న స్టేషను మాస్టరుతో ఏమీ మాట్లాడక కేవలం విష్‌చేసి ఎటెండెంటు వేపున్న ద్వారం లోంచి దొరగారు సెలూన్ లోకి ఎక్కారు. లోపలనున్న పొగలేని పొయ్యిమీద నీళ్లు కాగుతున్నాయి

ఒక పక్క. మరోపక్క టీ తయారవుతోంది. లోపల చాలా వెచ్చగా వుంది.

"స్టైనో లేచారా?" దొరగారు ప్రశ్నించారు

"ఏడున్నర వరకు లేపొద్దన్నారు"

దొరగారు బాత్‌రూమ్‌లోకి పోయి పది నిమిషాలలో తిరిగి వచ్చారు. పైడయ్య ఇచ్చిన టీ తాగి వాచీ చూసుకొన్నారు. ఇంకా ఏడూ ఇరవై అయిదు మాత్రమే అయింది.

దొరగారు రాత్రల్లా నిద్ర లేక కళ్ళు లోతులకు పోయి జుత్తు చెదిరి బట్టలు నలిగిపోయి చాల అలసినట్లు కనిపించారు. అతను ఛాంబరు తలుపు మీద కొట్టి, "మే ఐ కమిన్ ప్లీజ్!" అని కొంచెం గట్టిగా అన్నారు.

"ప్లీజ్ వెయిట్ ఫర్ టూ మినిట్స్" లోపలి నుండి జవాబు వచ్చింది. సరిగా నిమిషాలలో లోపలి గడియ తీసింది నీహారిక.

దళసరి నైటీ తొడుక్కొని ఆమె భుజం మీద తెల్లటి కాశ్మీర శాలువ కప్పుకుంది.

దొరగారు లోపలికి ప్రవేశించి కిటికీ దగ్గరవున్న సోఫాలో కూలడబడిపోయారు. నీహారిక పక్కబట్టలు సర్దే లోపుగా, అవలించి సోఫాలో నిద్రపోయాడు. నీహారిక పక్కబట్టలు పక్కన పెట్టి బాత్‌రూమ్‌కి వెళ్లిపోయింది.

బజారుకి పోడానికి జీప్ ఏర్పాటుచేయమని స్టేషను మాస్టరుగారికి పైడయ్యతో కబురు పంపింది. స్నానాదులు ముగించుకొని, తయారయి, సరిగ్గా ఎనిమిదికి బజారుకి పోయి ఎనిమిదిన్నరకు తిరిగి వచ్చింది. తరువాత తొమ్మిదిన్నర వరకు పైడయ్యకు సహాయం చేస్తూ కూర్చుంది.

దొరగారి ఛాంబర్ తలుపు తీసే వుంది. అప్పటికి కూడా అతను లేవకపోతే నీహారిక మళ్లా లోపలికి వెళ్లింది.

వరదాచారి గాఢమైన నిద్రలో వున్నాడు. నీహారిక మూడుసార్లు అతని భుజం తట్టి లేపింది.

క్రమ క్రమంగా అతను మేలుకున్నాడు. మంచు బొట్లు పడి తాజాగా వున్న తామరపువ్వవలె నీహారిక ముఖం అతనికి కనిపించింది.

"గుడ్‌మార్నింగ్ నీహారికా"

"గుడ్‌మార్నింగ్ సార్"

"టైమెంతయింది"

"తొమ్మిదిన్నర"

"ఎన్నిగంటలకు ట్రాలీ సిద్ధంగా వుటుంది?"

"పది గంటలకి"

"అరగంట వ్యవధి వుందన్న మాట"

"అవును బాస్! రెండు సార్లు ఎనిమిదిన్నర తరువాత మిమ్మల్ని లేపడానికి ప్రయత్నించాను. జోళ్లు కూడా విప్పకుండా మీరు పడుకున్నారు."

వీరదాచారి పాదాలు చూసుకున్నాడు. కాళ్లకు జోళ్లు లేవు. పక్కనపెట్టి వున్నాయి. అంతేకాక లేత నీలం రంగులో వున్న ఇంగ్లీషు రగ్గు తన మీద కప్పి వుండడం చూశాడు.

పది నిమిషాలు తక్కువ పదికి అతను తయారయాడు. డైనింగ్ టేబుల్ ముందుకు లాగి ఆఫీసరుకు, నీహారికను బ్రేక్ ఫాస్ట్ అమర్చాడు పైడయ్య.

పదింకా అవలేదు. అతను డైనింగ్ టేబిలు నుండి లేవడానికి సిద్ధమవుతుంటే నీహారిక అంది.

"బాస్! మీతో రెండు సంగతులు చెప్పాలి"

"యస్-నీహారికా!"

"పొద్దున్న వచ్చిన మాస్టరుగారి ద్వారా రెండు లీటర్లు పాలు తెప్పించాము. వాటికతను డబ్బు పుచ్చుకో నన్నారు. డబ్బులు తీసుకోకపోతే పాలు పట్టుకుపొమ్మన్నాను. నాకు లైను మీద ఆచారాలు తెలియవు."

"యూ ఆర్ రైట్"

"ఇక రెండోది. మాస్టరుగారు లంచికి పులిహోర,బొబ్బట్లు పంపుతానన్నారు. వాళ్ళావిడ వాటిని తయారు చేయడంలో స్పెషలిస్టట. వాళ్ళబ్బాయికో అమ్మాయికో పెళ్ళి చేసేటప్పుడు దొరగారిని ఆహ్వానించి కడుపు నిండా వాటిని పెట్టనున్నాను. దీనికి మీరేమంటారో నాకు తెలీదు."

"అనడాని కేముంది?"

"మీకు ఈ రెండు పిండి వంటలు ఇష్టమయితే, ఇప్పటికీ మించి పోలేదు, వెంటనే కబురు పంపుతాను. లంచి వేళకి వేడి వేడిగా తయారయి వస్తాయి."

వరదాచారి నవ్వేసి వద్దన్నట్టు చెయ్యి తిప్పాడు.

అతను లేచి నిలబడ్డాడు.

"నీహారికా! ఎంక్వయిరీ కమిటీ మెంబర్లం ఇంజను పడిపోయిన చోటికి ట్రాలీ మీద వెళ్ళి తిరిగి వచ్చేసరికి పదకొండున్నర అవుతుంది. ఆ సరికి మీరు ఫైళ్ళు, టైపు మెషీన్ పట్టుకొని ఆఫీసులో వుంటే, వెంటనే ఎంక్వయిరీ మొదలు పెడతాం."

ఎంక్వయిరీ నుండి వాళ్ళు మధ్యాహ్నం లంచికి వచ్చేసరికి రెండు దాటింది.

లంచి దివ్యంగా వుంది.

మధ్యాహ్నం మూడు గంటలకు తిరిగి మొదలయిన ఎంక్వయిరీ సాయంకాలం అరున్నరవరకూ సాగింది.

నీహారిక లేత రంగు పట్టుచీర కట్టుకుంది. అదే బట్టతో కుట్టిన బ్లౌజు తొడుక్కుంది. అంతకు మించి మరేదీ ఆడంబరంగా లేదు. వరదాచారి ఎంతవేగంగా,చక్కగా పనిచేశాడో నీహారిక కూడా అంతకు తీసి పోకుండా పని చేసింది.

నీహారిక ఎమ్.ఏ. ఇంగ్లీషు లిటరేచరులో పాసయింది. సెక్రేటేరియల్ కోర్సులో డిప్లమా తీసుకుంది. షార్ట్ హాండ్, టైప్ రైటింగులలో హయ్యరు పరీక్షలు రాంకులలో పాసయింది. సర్వీస్ కమీషన్ పరీక్షలో మంచి మార్కులతో పాసయి, తిన్నగా సీనియర్ స్టెనోగా ఉద్యోగంలో ఆరు నెలల క్రింద చేరింది.

నీహారిక చాలా చక్కనిది. మంచి సంస్కారం ఆ అందానికి మెరుగులు దిద్దుతుంది. ఆమె తండ్రి గారు పెద్ద ఉద్యోగమే చేసి రిటైరు కాకుండా చనిపోయారు. ఆమెకో తమ్ముడు, తల్లి వున్నారు.

ఆఫీసు కారిడార్లలో ఆమె నడుస్తే, ఎటువంటి మనిషయినా ఒక క్షణం ఆగి ఆమెను చూస్తూ ఉండిపోక తప్పదు. రెండు నెలల క్రింద ఒక సీనియరు ఆఫీసరు ఆమెతో కొంచెం దారి తప్పి మాట్లాడితే, షార్టు హాండ్ నోట్ బుక్ అతని ముఖం మీదకి విసిరేసి చక్కా బయటకి నడిచింది. అతను వ్రాతపూర్వకంగా క్షమాపణలు చెప్పేదాక ఎవరి దగ్గరా పని చేయలేదు. అందు చేతనే ఉద్యోగం చేసే ఆడవాళ్ళకు ఆమె అంటే చాలా గౌరవం.

నీహారిక పగలంతా పనిచేసినా అలసినట్లు కనిపించలేదు. అప్పుడే విడిన గులాబిలా తాజాగా కనిపించింది.

ఆ రాత్రి పది గంటలకు అక్కడికి వచ్చే పాసింజరుకు సెలూన్ తగిలించారు.

రాత్రి తొమ్మిదిన్నరకు డిన్నరయింది. పాసింజరు రాగానే, దొరగారు,రగ్గు,దుప్పట్లు తలగడాలు పైడయ్య పట్టుకొని వెంట రాగా, ట్రెయిన్‌లో ఫస్టు క్లాస్ కూపేలో పక్కవేసుకొని హాయిగా నిద్రపోయారు.

నీహారిక స్పెషల్ బెడ్‌మీద పడుకొని ఉదయం ఏడు గంటలకు లేచింది. స్నానాదులు ముగించి ఆమె బాత్ రూము నుండి వచ్చేసరికి ఎనిమిదయింది. సోఫాలో తన కోసం వేచియున్న ఆఫీసరు,చక్కగా తయారయి వచ్చిన నీహారికకు గుడ్ మార్నింగ్ చెప్పి బాత్ రూమ్‌లో ప్రవేశించాడు.

పాసింజరు సరిగా పదిగంటలకు గమ్యం చేరుకుంది.

సెలూన్ ముందు వేపునుండి దొరగారు దిగారు.

వెనుక ద్వారం నుండి నీహారిక సామానులు, టైప్ రైటరు దిగాయి. పైడయ్య,డ్యూటీలో

వున్న వాళ్ళచేత సామాన్లు మోయిస్తానన్నాడు. కానీ నీహారికి ఒప్పుకోలేదు. నలుగురు పోర్టర్లను పిలిచి సామానుఎత్తుకోమంది. స్టేషన్ పోర్టికోలో జీప్ సిద్ధంగా ఉంచాడు సూర్యారావు. సామానులన్నీ జీపులోకి ఎక్కించారు.పోర్టర్లకు నీహారిక ఇరవై రూపాయలిచ్చింది.

ఇంతలో దొరగారు వచ్చారు. నీహారిక జీప్ పక్కనే నిలబడింది.

"నీహారికా! ఇప్పుడు పది గంటల పది నిముషాలయింది మీరు ఎన్ని గంటలకు ఆఫీసుకు రాగలరు?"

"పదకొండు గంటలకు"

"గుడ్! సూర్యారావ్! బంగళా దగ్గిరే కదా! నేను నడిచి వెళ్ళిపోతాను. స్టెనో గారిని ఇంటికి దిగబెట్టి, తిరిగి పదకొండు గంటలకు ఆఫీసుకు తీసుకురా!"

నీహారికను తీసుకొని జీప్ వెళ్ళిపోయింది.

* * *

డివిజనల్ ఆఫీసులో ఆడవాళ్ళకో స్టాఫ్ రూముంది. ఆఫీసులో పని చేస్తున్న ఆడవాళ్ళు మధ్యాహ్నం లంచి పీరియడ్‌లో అక్కడ చేరుతారు. రోజూ ఓ పన్నెండు మంది మహిళలు అక్కడ చేరి, తొందర తొందరగా తెచ్చుకొన్నవి తిని, ఒక అరగంట వరకు ఇష్టా గోష్టి జరుపుతారు.

నీహారిక ఒంటి గంటన్నరకు స్టాఫ్ రూమ్ చేరుకుంది. రెండయేసరికి అందరూ టిఫిన్ కారియర్లు తీసి, టేబులు చుట్టూ కూర్చున్నారు. హెడ్ టైపిష్టు వెంకట లక్ష్మమ్మ గారు ఆ సమితికి అధ్యక్షురాలు.

వెంకటలక్ష్మమ్మ తన జాగాలో కూర్చొని కార్య క్రమం ప్రారంభించారు.

"సోదరీ మణులారా! ఈ రోజు బుధవారం, క్రిందటి బుధవారం నాటి సంగతులు మరోసారి జ్ఞాపకానికి తెస్తున్నాను.

"నీహారిక తన స్నేహితురాలు బొంబాయి నుంచి వ్రాసిన ఉత్తరం మరోసారి చదువుతున్నాను.

" మైడియర్ నీహారికా!

చాలా కాలమయి ఉత్తరాలు లేవు. నువ్వు బాగున్నావా? అమ్మగారెలా వున్నారు?

మేము బరోడా ట్రయినింగులో ఉన్నప్పుడు ఆడ వాళ్ళం, మొగవాళ్ళు చనువుగా తిరిగే వాళ్ళం. వాళ్ళు పాడే పాటలకు మేం జవాబుగా పాడే వాళ్ళం. ఇంతటి సరదాలోను పాల్గొనని ప్రబుద్ధుడొకడుండేవాడు. అపర ప్రవరాఖ్యుడైన ఆ మనిషి అంటీ అంటక ముట్టీ ముట్టక ఉండేవాడు. ఆ వీరదాచారి తండ్రిగారు వెంకటాచారి గారు - మద్రాసు హైకోర్టు ఛీఫ్ జస్టిస్ ఆయన. ఈ మహానుభావుడు వాళ్ళకొక్కడే కొడుకు. అందానికి,తెలివి తేటలకు లోటు లేదు.

అతను మీ డివిజనుకి ఆరు నెలల కింద వచ్చాడని తెలిసింది. ఆ మనిషికి ముకు తాడు వేసి తన వెనుక ఏ అమ్మాయేనా తిప్పుకుంటే నేను చాలా సంతోషిస్తాను.

" ఆ ఉత్తరం మనమందరం విన్నాం. దొరగారికి ఎవరు ముకుతాడు కడతారని ప్రశ్న వచ్చింది. ఎవరూ ముందుకు రాకపోతే నీహారిక తానే నిలబడింది.

"వరదాచారి గారితో లైను మీద కెళ్ళి వస్తావని అతని నుండి ఒక ముద్దును పొందుతానని ఆమె అంది. ఆమె అలా చెయ్యలేదని మనమందరం అన్నాం. అప్పుడు పందెం పది రూపాయలు మనం వేయడానికి, నీహారిక నూరు రూపాయలు వేయడానికి, పందెం ఆమె గెలిస్తే ఆమెకీ, డబ్బంతా చెందుతుంది, ఓడిపోతే మనకు చెందుతుందని నిర్ణయించాము.

"ఇప్పుడు నీహారిక తన అనుభవాలను చెప్తే, ఆమె పందెం గెలిచిందీ లేనిదీ నిశ్చయిస్తాము.'

"ఇందులో రెండు భాగాలున్నయి. ఒకటి,వరదాచారిగారితో లైను మీద కెళ్ళి రావడం. ఈ భాగం సంపూర్ణంగా అమలు జరిగింది. ఇక రెండో భాగం గురించి కొంచెం వివరంగా చెప్పాలి.

"సెలూనులో వరదాచారిగారితో నేను ప్రయాణం చేసి వారిని ఇబ్బందులకు లోను చేశాను. అన్నిటినీ ఆయన ఓర్చుకొని,మర్యాదగా ప్రవర్తించి దూరంగానే ఉన్నారు. తిరుగుదలలో కూడా అతను పనులన్నీ ముగించుకొనీ బుద్ధిగా సెలూనులో కూర్చున్నారు. అతనిని రెచ్చగొడితే కాని కార్యం సాధించలేమని, రమారమి తొమ్మిది గంటలకు అతని ఛాంబరులోకి ప్రవేశించాను. దొరగారితో చాలా అర్జంటు విషయాలు మాట్లాడాలని, ఎవరూ లోపలికి రావద్దని అటెండెంటు పైడయ్యతో చెప్పాను. తరువాత దొరగారి ఎదురుగా నిలబడి అన్నాను:

"బాస్! మీతో రెండు విషయాలు మాట్లాడాలి."

"ఎస్! నీహారికా!"

"ప్రయాణం చేసిన రెండు రాత్రులు మీరు సెలూన్ విడిచి పైన గడిపారు. మీకు నావల్ల చాలా యిబ్బంది కలిగింది. క్షమాపణలు వేడుకుంటున్నాను."

"ఓ! దానికేముంది! నాకేం ఇబ్బంది లేదు. పైగా మంచి నైట్ ఇనస్పెక్షన్ చేశానన్న తృప్తి కలిగింది."

"ఆ విషయంలోనే నాకు చాలా బాధ కలుగుతోంది. నా కారణంగా మీరు ఇన్‌స్పెక్షన్‌కు పోయారు. లేక పోతే ఇంతమందికి సస్పెన్షన్లు,బదిలీలు,బుక్-ఆఫ్ లు మొదలైనవన్నీ ఉండేవి కావు. వాళ్ళు పెట్టేశాపనార్థాలన్నీ ఇండైరెక్టుగా నాకే తగులుతాయి."

"ఐ. సీ!"

"నేనో విషయం మీకు చెప్పాలనుకుంటున్నాను. మీరు వాళ్ళను శిక్షించడంలో పొందే సంతృప్తి కన్న క్షమించడంలోనే హెచ్చు ఆనందం పొందుతారు. ఆ ఉద్యోగులు మీ కోసం

ఇంకా శ్రమపడి పని చేస్తారు."

"అదెలా సాధ్యం?"

"శిక్షించినట్లే క్షమించండి."

"మీరు చెప్తున్నారు కాబట్టి..."

"వారి శిక్షలన్నీ రద్దు చేయండి"

"అతను నవ్వుతూ తల ఊపారు."

"మీరు ఒక వారం క్రింద తొందరగా కలకత్తా వెళ్లిపోతూ నాకో చీటీ పంపించారు. సెలూన్ ఇంచార్జి వెంకటనారాయణ ఫోనులో దొరకడం లేదని, సెలూన్ బాగా ఉంచమని అతనితో చెప్పమని అందులో వ్రాశారు. నేను జీపు మీద అతని దగ్గిరికి వెళ్ళి , సెలూన్ పరీక్షించి, చేయవలసిన మార్పులన్నీటికీ ఒక లిస్టు యిచ్చాను. కర్టెన్లు, కట్లెరీ, క్రాకరీ మొదలైన వన్నీ బజారులో కొన్నప్పుడు, స్వయంగా ఎంపిక చేశాను. చివరకు బోసిగా నున్న గలీబులు తలగడాలకు తగిలిస్తే, వాటిని యింటికి తీసుకు పోయి పువ్వులు కుట్టాను. ఇవన్నీ మీరు కూడా గుర్తించారు. ప్రచ్ఛన్నంగా ఉండి ఇన్ని చేసిన నన్ను కాని, కనీసం ఇంచార్జి వెంకటనారాయణను కాని మీరు అభినందించలేదు."

"దొరగారు నా మాటలన్నీ విని సావకాశంగా అన్నారు:

"ఐ, సీ."

"మీరు అధికారులు. కింది వాళ్లు పని చేయక ఏం చేస్తారని మీకు అంధ విశ్వాసం!"

"అవునవును"

"దీనికి కూడా నేను విచారించలేదు. ఇవన్నీ ఆఫీసుకి సంబంధించిన విషయాలు. మీరు ఆరు నెల్లయి లైనుమీద అప్పుడప్పుడు వెళ్తున్నారు. అటెండెంటు పైడయ్య మీకు లంచి,డిన్నరు అన్నీ వండి పెడుతున్నాడు. ఈ సారి నేను వచ్చినప్పుడు రెండు డిన్నర్లు, ఒక లంచి రెండు బ్రేక్ ఫాస్టులు సెలూనులో తయారయాయి. వాటి నన్నిటినీ ఆరగించి మీరు సంతోషించారని చెప్పడానికి, మీతో బాటు టేబులు దగ్గర కూర్చున్న నేనే సాక్ష్యం. మీ కోసం నేను శ్రమపడినందుకు మీరు అభినందించనక్కరలేదు, కనీసం బాగున్నాయని కూడా అనలేదు."

"దొరగారు జవాబు చెప్పడం మాని నా కళ్ళలోకి చూస్తూ ఉండిపోయారు.

"అప్పుడు కొంచెం బాధగా అన్నాను.

"మీకు పుస్తకాలలో వున్న రూల్సు తెలుసును. కాని, మీ మీద మనసుంచి, ఆర్ద్రమయిన హృదయంతో శ్రద్దగా చేసిన పని మీకు తెలిసి రాలేదు."

"ఈ మాట లంటుంటే అప్రయత్నంగా నా గొంతు బొంగురు పోయి, కళ్ళంట నీటి బొట్లు రాలాయి.

"నా ముఖంలో కి చూస్తూన్న దొరగారు కూడా చలించినట్లున్నారు.

'అయామ్ సారీ, నీహారికా! వెరీ వెరీ సారీ!'

నేను కళ్ళు తుడుచుకున్నాను.

"ఇంకా ఇరవై అయిదునిమిషాలలో చేరవలసిన స్టేషను వస్తుంది.

"తొందరగా విషయం మార్చి అన్నాను"

"మీరు సారీ చెప్పారు కాబట్టి అన్నీ మరిచి పోతున్నా. అన్నట్లు మీరు వేసుకున్న టై మాసిపోయిందే! ఆ ముడేమిటి! అయ్యో నేను గమనించనే లేదు"

"అవును నీహారికా! మరో టై తెచ్చుకోడం మరచి పోయాను."

"నేను కూడా మరచి పోయాను. నెల్లాళ్ళ క్రింద స్టేట్సులో నున్న మా తమ్ముడికి ఉత్తరం వ్రాస్తూ మా బాస్‌కో మంచి టై పంపమన్నాను. మనం లైను మీద బయలుదేరిననాడే అమెరికా నుండి వచ్చిన మా వాడి స్నేహితుడొకడు టై, టైపిన్ను తెచ్చి యిచ్చాడు అవి నా బాగ్‌లోనే ఉండి పోయాయి. ఏదీ! ఒక్క సారి నిలబడండి! ఆ టై విప్పి దీనిని కడతాను."

"ద్వారగారు లేచి నిలబడ్డారు.

"అతని మెడలో వున్న పాత టై విప్పి, కొత్తది, వెడల్పయిన 'వి' నాట్‌తో కట్టి, మెరుస్తున్న పిన్ను తగిలించాను.

"అతను అద్దంలో చూసుకొని నావేపు తిరిగారు.

"అదే ఛాన్సు!

"గాఢంగా అతనిని కౌగిలించుకుని, బుగ్గలమీద, నుదుటి మీద పెదవిరంగు ముద్రలు పెట్టి, పెదవులను అయిదు నిమషాల వరకు విడవకుండా ముద్దు పెట్టుకున్నాను.

"పది నిమషాల తరువాత కౌగిలి సడలిస్తే, తోటకూర కాడకు మల్లే దొరగారు సోఫాలో కూలబడిపోయారు.

"స్టేషను చేరుకోడానికి ఇంకా పది నిమిషాలే ఉంది.

"తన్మయతతో ఈ అవతారం ఇలాగే ప్లాట్ ఫారమ్ మీద దిగితే పరువు పోతుందని నా రుమాలు గ్లాసులోని నీళ్ళలోముంచి; ఆ ముద్రలన్నీ చెరిపి, హృదయం వరకు దూసుకుపోయేటట్లు అతని కళ్ళలోకి చూసి, అక్కడ నుండి వచ్చేశాను.

"ఇదీ జరిగిన సంగతి. నేను గెలిచానో,ఒడి పోయానో నిర్ణయించవలసింది మీరే" అప్పుడు వెంకటలక్ష్మమ్మగారు ధర్మాసనం అధిష్టించారు.

"నీహారిక కథనం నమ్మదగినదిగా ఉంది. ముద్దు విషయంలో మన అభిప్రాయంవేరు. పురుషుడు తానుగా ముద్దు పెట్టుకోవాలిన కోరాం. మన షరతు సందిగ్ధంగా ఉంది. కాబట్టి నీహారికదే...."

సీతామాలక్ష్మి లేచి ప్రశ్న వేసింది.

"నీహారిక ముద్దు పెట్టుకున్నట్లు సాక్ష్యమేది?"

"మీ బాస్‌ని అడిగిరమ్మన్నా రా?" అంది శేషమ్మ.

"అతను పన్నెండున్నరకు మెయిలులో మద్రాసు వెళ్ళిపోయారు. వాళ్ల మమ్మీని, డాడీని సంప్రదించడానికీ" అంది నీహారిక.

"అటెండెంట్ పైడయ్యను అడుగుదాం, చూశాడేమో!," అంది సీతాలక్ష్మి.

"మీ అందరికీ పెళ్ళిళ్ళయ్యాయి. నలుగురూ చూస్తుంటేనే మీరు ముద్దులు పెట్టుకుంటారా?" అడిగింది నీహారిక.

"అదీ పాయింటే!" అన్నారు వెంకటలక్ష్మి గారు.

"షరతులు సంపూర్ణంగా అమలు జరగకపోతే గెలుపు లేదు" అంది మరో అమ్మాయి.

"మీలో ఎంతమంది నీహారికకు అనుకూలంగా ఉన్నారో చేతులెత్తండి"అన్నారు వెంకటలక్ష్మిగారు.

అయిదుగురు చేతులెత్తారు.

"ప్రతికూలంగా ఉన్నవాళ్ళు"

అయిదుగురు చేతులెత్తారు. మిగిలిన వాళ్ళు చేతు లెత్తడానికి అంగీకరించలేదు.

"చివరి నిర్ణయం వెంకటలక్ష్మిగారిదే" అంది సీతామాలక్ష్మి. ఆవిడ ఒక క్షణం ఆలోచిచారు.

"పూర్వాపరాలు విచారించిన తరువాత సరియైన సాక్ష్యాధారాలు లేకపోవడం చేత, నీహారిక..."

ఆవిడ మాటలు పూర్తి కాకుండా నీహారిక అంది.

"ఆగండి! ఆగండి! మీకు మరో సంగతి చెప్పాలి."

అందరూ నిశ్శబ్దంగా కూర్చున్నారు.

"నేను సరిగా పదకొండు గంటలకు ఆఫీసుకు వచ్చాను. రాగానే దొరగారి సలాములు నాకందించాడు చప్రాసీ. నోట్ బుక్ తీసుకొని చాంబరులోకి ప్రవేశించాను. లోపలికి ఎవరూ రాకుండా దొరగారు రెడ్ లైటు వెలిగించారు.

"మీ కోసం పదిన్నన్నర దగ్గిర నుంచి చూస్తూన్నాను' అన్నారాయన

"డిక్టేషనిస్తారా? అడిగాను నేను.

"ఆపుస్తకం పారేయండి"

"ఏ అర్జంటు ఫైలు తెమ్మన్నారు?"

"వాటిని కూడా మరిచిపోండి"

"అయితే మీకేం కావాలి?"

"మనసంగతి మీతో మాట్లాడాలి."

"మన సంగతా?"

"అవును కొన్ని విషయాల గురించి సరాసరి మాట్లాడవచ్చు. హృదయానికి సంబంధించిన వాటి గురించి మాట్లాడం కష్టం."

"ఆ పక్షంలో కాగితం మీద పెట్టోచ్చు కదా!"

"చాలా మంచి ఐడియా!"

"దొరగారు టేబులు డ్రాయరు నుండి తన లెటర్ పాడ్ తీశారు. రెండు కాగితాల మీద ఒకే విషయం వ్రాసి నాకిచ్చారు. వాటి మీద నా అభిప్రాయం వ్యక్తం చేసి, ఒక కాపీ అతనికిచ్చి, ఒకటి నేను తెచ్చాను. బహుశా మీకు దీనిలో కావలసినంత సాక్ష్యం లభిస్తుంది."

వెంటనే లక్ష్మమ్మగారు ఆ కాగితం తీసుకుని అయిదు నిమిషాలు మళ్ళా మళ్ళా చదువుకున్నారు..

"ఈ బలమైన సాక్ష్యం ఆధారంగా గెలుపు నీహారికదే!"

"కాగితమ్మేదో చదివి వినిపించండి" అందరూ అరిచారు.

"వినండి

డియర్ నీహారికా

మిమ్మల్ని నేను ప్రేమిస్తున్నాను!

నన్ను పెళ్లి చేసుకోడానికి అభ్యంతరమా?

వరదాచారి.

డియర్‌బాస్!

మిమ్మల్ని నేను కూడా డిటోయే!

మిమ్మల్ని పెళ్ళి చేసుకోడానికి ఎటువంటి అభ్యంతరం లేదు. నీహారిక."

లేడీస్ స్టాఫ్ రూమ్ చప్పట్లతో మార్మోగింది.

(ఆంధ్రజ్యోతి దీపావళి సంచిక)